# గర్భకవిత్వము

## జెజ్జాల కృష్ణ మోహన రావు

J. K. Mohana Rao
1593 Elmwood Court
Frederick
Maryland 21702, USA

Phone-
Office: (301) 846 5032
Home: (301) 695 5932
E-mail: jkmrao@yahoo.com

# గర్భకవిత్వము

## పరిచయము–

కవిత్వము నాలుగు విధములు. అవి– ఆశు, మధుర, చిత్ర, విస్తార కవితలు. ఆశుకవిత్వ మనగా ఉన్నట్లుండి వచ్చిన ప్రేరణతో అప్పటికప్పుడే చెప్పు కవిత్వము. అల్లసాని పెద్దన రచించిన ఉత్పలమాలిక "పూత మెఱుంగులుం బసరుపూపబెడంగులు జాపునట్టి..." ఆశు కవిత్వమే. అదే విధముగా అవధానప్రక్రియ లొనరించువారి పద్యములన్నియు ఆశుకవిత్వమే. మకుటాలంకృతాష్టకములు, సర్వవిభక్తికలిత ఉదాహరణ కావ్యములు మధుర కవితలు. అష్టాదశ వర్ణనలతో, నానాలంకరములతో నిండిన ప్రబంధాదులు విస్తార కవితలు. ఇక గర్భబంధాదులు చిత్రకవితలు. గర్భకవిత్వ మనగా నేమి? ఒక పద్యములో మఱొక పద్యపు లక్షణములను పొందుపరచుటయే ఈ చిత్రకవిత్వపు ఆశయము. ఇట్లు పొందుపరచిన పద్యముల కన్నిటికి గణయతిప్రాసలు సరిగ నుండవలయును. ఇట్టి చిత్రకవిత్వములోని వింతలను, విశేషాలను వివరించి, అందులో నేను చేసిన కొన్ని క్రొత్త ప్రయోగములను విశదీకరించుటయే యీ వ్యాసపు ముఖ్యోద్దేశము.

## తెలుగు ఛందస్సు–

తెలుగులో పద్యములు మూడు విధములు. అవి– వృత్తము, జాతి, ఉపజాతి. యమాతారాజభానసలగములతో పాదమునకు ఒకటినుండి ఇరువదియాఱు అక్షరముల వఱకు ఉన్న పద్యములను వృత్తము లనెదరు. ఈ వృత్తములకు యతి ప్రాసలు అవసరము. యతి అనగా పాదములోని మొదటి అక్షరమునకు అదే పాదములోని ఒకటి లేక కొన్ని అక్షరములతో స్వర–వ్యంజన మైత్రి ఉండుట. కొన్ని వృత్తములకు, ఉపజాతులకు సామాన్య యతికి బదులు ప్రాసయతిని వాడుట సబబే. ప్రాస రెండవ అక్షరము. ఈ ప్రాస సంస్కృతములో లేదు. ఇది ద్రావిడ భాషల ప్రత్యేకత. ఒక మాత్రాకాల పర్యంతము ఉచ్చరించు అక్షరము లఘువు, అంతకన్న ఎక్కువ కాలము తీసికొను అక్షరము గురువు. పద్య పాదము లన్నియు గురులఘువులతో నిండియుండును. ఒకటినుండి ఇరువదియాఱు అక్షరములవఱకు గల మొత్తము సమవృత్తముల సంఖ్య 134,217,726. ఇందులో వేయికన్న తక్కువ వృత్తములకు మాత్రమే లాక్షణికులు పేరు లుంచిరి. అందులో ఏబదికన్న తక్కువ వృత్తములను మాత్రమే కవులు వాడిరి. తెలుగు సాహిత్యములో నన్నయనుండి నేటివఱకు చంపకోత్పలమాలలను, శార్దూల మత్తేభవిక్రీడితములను మాత్రమే కవులు విరివిగా వాడిరి. మిగిలిన వృత్తములను చాల తక్కువగా నుపయోగించిరి. జాతి పద్యములు మాత్రాగణములతో, అంశ లేక ఉపగణములైన సూర్య, ఇంద్ర, చంద్ర గణములతో వ్రాసెదరు. జాతి పద్యములకు యతి ప్రాసలు నియతము. కంద, ఉత్సాహ, అక్కరలు కొన్ని జాతి పద్యములు. ఉపజాతి పద్యములను సూర్య, ఇంద్ర, చంద్ర గణములతో యతితో లేక ప్రాసయతితో రచించెదరు. ప్రాస ఉపజాతుల కనవసరము. సీసము, ఆటవెలది, తేటగీతి ఉపజాతులలో ప్రసిద్ధమైనవి.

**గర్భకవిత్వపు నాంది–** సంస్కృతములో గర్భకవిత్వము వర్ణచ్యుతకమువలన ఏర్పడును. ఒక పద్య పాదములో ముందువెనుకల నున్న కొన్ని అక్షరములను తప్పించిన మఱొక పద్యము ఏర్పడును. కాని తెలుగులో గర్భకవిత్వము వృత్త, జాతి, ఉపజాతులలోగల అన్ని పద్యములకు వర్తించును. ఇవి గూఢ పద్యములు అని చెప్పవచ్చును. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన రసవత్తరమైన పద్యములతో సన్నివేశములతో భారతకథాగమనమును సాగించిరి. కాని వీరెవ్వరును చిత్రకవిత్వమును, అందులో గర్భకవిత్వమును వ్రాయలేదు. ఆ ఖ్యాతి రాజకవి, కవిరాజ శిఖామణియైన నన్నెచోడునికి దక్కినది. చాలమంది కవులవలె నన్నెచోడుని కాలము వివాదాంశము. ఇతని కుమారసంభవములోని భాషా వైచిత్రివలన కొందఱు ఇతడు నన్నయకు పూర్వుడని తలతురు. కాని ఎక్కువమంది ఇతడు నన్నయతిక్కనల మధ్యకాలస్థుడు అని నిర్ణయించిరి. ఇతని కుమారసంభవములోని క్రింది పద్యము తెలుగులో మొట్టమొదటి గర్భకవిత్వ మని భావించవచ్చును.

చంపకమాల–
హరు మనమార గొల్చు డరు దాతని గొల్చియు నాదిబోడ దా
బొరయును భూరిభోగ పురభూతి విభుత్వము బొంది పేర్మితో
బర జన దారుణోగ్ర శరపాత నియుక్త పదంబునందు దా
బొరయడు పోరి కోర్చి పొరి భూతగణేశ్వరు బొందు నాత్మలోన్

ఇందులో దాగియున్న కందము–
మనమార గొల్చు డరు దా–
తని గొల్చియు నాదిబోడ దా బొరయును భూ–
జన దారుణోగ్ర శరపా–
త నియుక్త పదంబునందు దా బొరయడు పో

**తఱువాతి కాలము–** తఱువాత విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణిలో క్రింది సరసిజ వృత్తముతో గర్భకవిత్వమునందు గల సాధనల అవకాశమును తెలిపెను. ఇందులోగల పద్యములు– నీలోత్పలమాల, మణిగణనికరము, రెండు కందములు.

సరసిజము– మ–త–య–న–న–న–న–స, యతి (1, 10, 18), ప్రాసయతి (1, 5)
శ్రీవిశ్వేశక్ష్మావరు సేవాశ్రితులు వొగడుదురు సిరి వరగుటకై
ధీవిద్యాసంభావితదేవున్ ధృతియుతు హితజనదివసదినకరున్
శ్రీవర్ణింతున్ భావనజీవున్ జితరిపు శశికులశిఖరిమృగపతిన్
భావోదంచద్భావితభావున్ బ్రతిదినసముదిత బహుతరవిభవున్

నీలోత్పలమాల– మ–త–య మణిగణనికరము– న–న–న–న–స, యతి (1, 9)

శ్రీవిశ్వేశక్ష్మావరు సేవా		శ్రితులు వొగడుదురు సిరి వరగుటకై
ధీవిద్యాసంభావితదేవున్		ధృతియుతు హితజనదివసదినకరున్
శ్రీవర్ణింతున్ భావనజీవున్		జితరిపు శశికులశిఖరిమృగపతిన్
భావోదంచద్భావితభావున్		బ్రతిదినసముదిత బహుతరవిభవున్

ప్రథమ కందము–
శ్రీవిశ్వేశక్ష్మావరు
సేవాశ్రితులు వొగడుదురు సిరి వరగుటకై
ధీవిద్యాసంభావిత
దేవున్ ధృతియుతు హితజనదివసదినకరున్

ద్వితీయ కందము–
శ్రీవర్ణింతున్ భావన
జీవున్ జితరిపు శశికులశిఖరిమృగపతిన్
భావోదంచద్భావిత
భావున్ బ్రతిదినసముదిత బహుతరవిభవున్

పిదప చాలమంది కవులు తమతమ కావ్యములలో గర్భకవిత్వమును సాధించిరి. అందులో కొందఱు– ముకుందవిలాస కర్త పెద్దన, కవిరాజమనోరంజన కర్త అబ్బయ, పారిజాతాపహరణ కర్త తిమ్మన, నరసభూపాలీయ కర్త భట్టుమూర్తి, రామరాజీయ కర్త వేంగన, రసికజనమనోభిరామ కర్త తిమ్మకవి, లంకావిజయ కర్త లక్ష్మణకవి, అప్పకవీయ కర్త అప్పకవి, ఉత్తరరామాయణ కర్త పాపరాజు. కావ్యాంతములలో, అశ్వాసాంతములలో దైవకీర్తన, రాజసన్నుతులుగా గర్భకవిత్వమును కవులు వాడిరి.

## గణపవరపు వేంకటకవి– గర్భకవితాసార్వభౌముడు గణపవరపు వేంకటకవి. తెలుగులో

చిత్రకవిత్వము అని పేరు చెప్పినయెడల తక్షణము స్ఫురించు పేరు గణపవరపు వేంకటకవిది. ఇతని శ్రీప్రబంధరాజవేంకటేశ్వరవిజయవిలాసము చిత్రకవిత్వమునకు ఒక నిఘంటువు అని చెప్పవచ్చును. అందులోని క్రింది సీసపద్యములో అరువదికిపైగా గర్భితములైన పద్యము లున్నవి. ఇట్టి పద్యము ఆంధ్ర సారస్వతములో అరుదని చెప్పుట అతిశయోక్తి కాదు.

సీసము–
సారాగ్ర్యసారస సమనేత్రయుగళ నారదరుచికాంతి నర ఘనపనిత
సారాతిధీర విశదవీన తురగ భైరవభవ జైత్రభర శుభకరణ
సారాతిహార విసరచారణహరిసరసహిత చంద్రశరజజయనుత
వారాశినారద పూజితపద గౌరవకటి ఖడ్గ గరళగళ సఖ
తేటగీతి–
హరినగనిలయ గిరిధర యసురదళన		మణిమయమకుట సురమణి మధునిశరణ
కరివరదకు వరరుచిరతర వసన న–		రహరి లసితదర నిగమవిహరణహరి

ఇందులోని కొన్ని పద్యములు– ద్విపద, కందము, పేరులేని ఒక వృత్తము, మహానవమి చౌపది, ఆటవెలది,

తేటగీతి, మదనవిలసితము, తురంగము, తాళవృత్తము, ధవళము, అష్టకము, రేకులు, అర్ధచంద్రికలు, లాలి, సువ్వాల, ఏల, మణిగణనికరము, కళికార్ధము, ఉత్కళికార్ధము, దరువు. ఆధునికులలో నాదెళ్ళ పురుషోత్తమకవిని గర్భకవితాచక్రవర్తి యనవచ్చును.

## గర్భకవిత్వపు వర్గీకరణము–

ఒకే పాటను ఎన్నియో రాగములలో పాడునట్లు ఒకే పద్యమును ఎన్నియో పద్యలక్షణములకు బద్ధము చేసి ఆ పద్యముల గతులను, గమనములను, లయలను ఒకే మాఱు అనుసరించ వీలగును. సంకేతముగా సందేశములను (coded messages) పంపుటకు ఇట్టి పద్యములు అనుకూలముగా నుండును. గర్భకవిత్వములను శాస్త్రీయముగా వివరించబోవుచున్నాను. నాయొక్క కొన్ని ఉదాహరణలలో పద్యపు పేరు కూడ ఉన్నది. దీనిని ముద్రాలంకార మనెదరు.

(1) వృత్తములలో వృత్తములను గర్భితము చేయుట– రెండు వృత్తములకు అక్షరములు సమానముగా నున్నప్పుడు ఫలకభేదము (frame shift) వలన దీనిని సాధించవచ్చును. స్రగ్విణికి గురులఘువులు– UIUUIUUIUUIU మొదటి గురువును చివరకు చేర్చిన మనకు భుజంగప్రయాతపు గురులఘువులు లభించును– IUUIUUIUUIUU. స్రగ్విణీగర్భితభుజంగప్రయాతము ఒకటి పారిజాతాపహరణములో గలదు. ఫలకభేదముతో జలద–కలహంసలకు క్రింద నా ఉదాహరణ–

జలదము– భ–ర–న–భ–గ (UIIIUIUIII UIIU) యతి (1, 10)
కలహంస– స–జ–స–స–గ (IIUIUI IIUIIUU) యతి (1, 7)

| జలదము– | కలహంస– |
|---|---|
| హా! చెలి నీవు లేక చెఱ యయ్యె గృహం– | చెలి నీవు లేక చెఱ యయ్యె గృహం బా |
| బా చెలువారు నీదు చిరు హాసములన్, | చెలువారు నీదు చిరు హాసములన్, నీ |
| నీ చెలిమిన్ దలంచ సెగ నిండె నయ– | చెలిమిన్ దలంచ సెగ నిండె నయయ్యో! |
| య్యో! చెలరేగె నొక్క చితి యుల్లములో! | చెలరేగె నొక్క చితి యుల్లములో, హా! |

(2) వర్ణచ్యుతకమువలన కూడ వృత్తములలో గర్భకవిత్వమును సాధించ వీలగును. క్రింద నా ఉదాహరణ–

వాణీ– ర–న–భ–భ–ర–ల–గ, యతి (1, 7, 13)
తెల్ల నైన తెల తెల్లని యుల్లపు దేవి వాణికిన్
నల్ల వాని నల నల్లని మోహను నారి పద్మకున్
చల్ల కంటి చల చల్లని యంబకు స్వర్ణ గౌరికిన్
కల్ల గాదు గలు గల్లన నా మది కైత పాడెదన్

| | |
|---|---|
| పద్మా- స-జ-స-జ-గ, యతి (1, 9) | అంబా- భ-భ-ర-లగ, యతి (1, 7) |
| తెల తెల్లని యుల్లపు దేవి వాణికిన్ | తెల్లని యుల్లపు దేవి వాణికిన్ |
| నల నల్లని మోహను నారి పద్మకున్ | నల్లని మోహను నారి పద్మకున్ |
| చల చల్లని యంబకు స్వర్ణ గౌరికిన్ | చల్లని యంబకు స్వర్ణ గౌరికిన్ |
| గలు గల్లన నా మది కైత పాడెదన్ | గల్లన నా మది కైత పాడెదన్ |

(3) ముందువెనుకలనున్న అక్షరములను మాత్రమే తొలగించవలయునను నియమము లేదు. మధ్యనున్న అక్షరములను కూడ తొలగించి గర్భకవిత్వమును పొందవచ్చును. నా ఉదాహరణ-

స్రగ్ధర- మ-ర-భ-న-య-య-య, యతి (1, 8, 14)
శ్రీవాగ్దేవీ కరమ్మిచ్చి చెలగు చదువుల్ జెప్ప వేగమ్ము రావా
శ్రీవారాశీ వరమ్మిచ్చి సిరుల ధరపై జిందజేయంగ రావా
శ్రీవిశ్వాంబా శివమ్మిచ్చి చిరసుఖములన్ జిల్కి దీవించ రావా
కావన్ రారే దయల్ గల్గ ఘనపదములన్ గాఢమౌ భక్తి గొల్తున్

మందాక్రాంత- మ-భ-న-త-త-గగ, యతి (1, (5), 11)
శ్రీవాగ్దేవీ చెలగు చదువుల్ జెప్ప వేగమ్ము రావా
శ్రీవారాశీ సిరుల ధరపై జిందజేయంగ రావా
శ్రీవిశ్వాంబా చిరసుఖములన్ జిల్కి దీవించ రావా
కావన్ రారే ఘనపదములన్ గాఢమౌ భక్తి గొల్తున్

ఈ రెండు వృత్తముల గురులఘువులను నిట్లు వ్రాసిన ఇందలి సారాంశము సులభముగా బోధపడును.
స్రగ్ధర- UUUUIUUIIIIIIUUIUUIUU
మందాక్రాంత- UUUU----IIIIIUUIUUIUU

(4) వృత్తములలో జాతులను (జాతులలో వృత్తములను) గర్భితము చేయుట- నా ఉదాహరణ-

సీసము-
మనసున బూచిన మల్లెల నల్లిన మాలల గొల్తును మాధవ నిను
బ్రణతుల వేడెదరా కవిరాజవిరాజితమౌ పలు ప్రస్తుతులను
గనులకు ముందుగ గంతుల వేయుచు గానము పాడుచు గాంచుమ నను
దను విట వేచెను దాపము తీరగ తప్పక రమ్మిట తాకగ నను
తేటగీతి (ద్విపద) -
వేగ వచ్చెద నంటివి ప్రియముగాను నే గవాక్షము వద్దనె నిలచినాను

మూగవోయెను డెందము ముదము లేక     రాగవీణను మీటర రమణ యిపుడు

కవిరాజవిరాజితము- న, ఆఱు జ-గణములు, లగము, యతి (1, 8, 14, 20)
మనసున బూచిన మల్లెల నల్లిన మాలల గొల్తును మాధవ నిన్
బ్రణతుల వేడెదరా కవిరాజవిరాజితమౌ పలు ప్రస్తుతులన్
గనులకు ముందుగ గంతుల వేయుచు గానము పాడుచు గాంచుమ నన్
దను విట వేచెను దాపము తీరగ తప్పక రమ్మిట తాకగ నన్

(5) వృత్తములలో ఉపజాతులను (ఉపజాతులలో వృత్తములను) గర్భితము చేయుట-
చంపకోత్పలమాలల గురులఘువులు- [(II(U)IIUIUIII) (UIIUIIUIUIU)]. ఇందులో యతిస్థానమునకు ముందున్న న-గణమునుండి ఇట్లు వ్రాసిన తేటగీతి లభించును- (IIIUIIUII) (UIUI). దీనిని ఆధారము చేసికొని శ్రీ రావిపాటి లక్ష్మీనారాయణ గారు భారతగర్భరామాయణమును రచించిరి. ఉత్పలమాల యంతయు రామాయణార్థములో నుండును, అందులోని తేటగీతి మాత్రము భారతార్థములో నుండును. అట్టి పద్యము ఒకటి (కోవెల సంపత్కుమార గారి ఛందఃకోశములో ఉదహరించబడినది) -

ఉత్పలమాల-
శ్రీరమణీయమై సిరుల జెంది వెలుంగును జిష్ణువీటి కై
మీరి యయోధనా గరిమ మించుచు బృథ్వి నఖండహస్తి ర -
క్షోరి గృహంబె యా పురియు నచ్చటి మేడలు వ్యోమ మంటు మేల్
తోరపు ఖ్యాతితో నగరి దూగులన్ హరి నట్టుతోడ దాన్

తేటగీతి-
సిరుల జెంది వెలుంగును జిష్ణువీటి          గరిమ మించుచు బృథ్వి నఖండహస్తి
పురియు నచ్చటి మేడలు వ్యోమ మంటు          నగరి దూగులన్ హరి నట్టుతోడ

నా ఉదాహరణ-

సీసము-
చిక్కటి పాలిని చేర్చి నే చక్కెర యన్నము కల్పితిన్ కన్న నీకు
మక్కువ వండితి మగ్ననై మిక్కిలి తీయని భక్షముల్ తినగ నీకు
దిక్కుల వెలుగొందె చక్కగా చుక్కలు మినుకంచు సంధ్యలో ననఘ యిపుడు
చెక్కిలి తడి జేసె చింత నా ప్రక్కన హృది నింప రా హరీ హృష్టి నీయ
తేటగీతి-

వెలిగె నీ దివ్వె నీకై ఛవిన్ గృహాన
లలిత గానాల విన్పింతురా గళాన
కలలు పండంగ హృన్నాయకా ముదాన
లలన నీదేర రావేలరా రయాన

ఉత్సుకము- భ-భ-ర, యతి లేదు
చిక్కటి పాలిని చేర్చి నే
చక్కెర యన్నము కల్పితిన్
మక్కువ వండితి మగ్ననై
మిక్కలి తీయని భక్షముల్

విలసితము- భ-స-జ-గ , యతి (1, 7)
దిక్కుల వెలుగొందె చక్కగా
చుక్కలు మినుకంచు సంధ్యలో
చెక్కిలి తడి జేసె చింత నా
ప్రక్కన హృది నింప రా హరీ

కౌముది- న-త-త-గ, యతి (1, 6)
వెలిగె నీ దివ్వె నీకై ఛవిన్
లలిత గానాల విన్పింతురా
కలలు పండంగ హృన్నాయకా
లలన నీదేర రావేలరా

(6) జాతులలో జాతులకు నా ఉదాహరణ-

ఉత్సాహ- (సూ-సూ-సూ-సూ) (సూ-సూ-సూ-గ) యతి (1.1, 5.1)
మాధవు డతి క్రూరుడు మతి మది యతనిని గోరెనే
మాధవు డొక చోరుడు చిన మనసును గొనెనే కటా
మాధవుడు నను మరచె గద మరువలే నతనిని నే
మాధవ కొన రా తనువును మనువును నిపుడే యిటన్

కందము-
మాధవు డతి క్రూరుడు మరి
మాధవు డొక చోరుడు చిన మనసును గొనెనే
మాధవుడు నను మరచె గద
మాధవ కొన రా తనువును మనువును నిపుడే

(7) జాతులలో ఉపజాతులు- నా ఉదాహరణ-

కందము-
తలచగ నాటవెలది మది
కెలయు నగవుల చిలికించు కృష్ణ కలయగా
నలు దెస కందపు నీలిమ

ఆటవెలది-
అలఘువై తలచగ నాటవెలది మది
కెలయు నగవుల చిలికించు కృష్ణ
కలయగా నలు దెస కందపు నీలిమ

యలమె గగన మందు హర్ష మలర నలఘుపై యలమె గగన మందు హర్ష మలర

(8) ఉపజాతులలో ఉపజాతులకు నా ఉదాహరణ-

సీసము-ఆటవెలది-

పానశాల జగతి వైభవోత్కృష్టమౌ పానపాత్ర లిచట పలువిధాలు
పాన మెన్నటికిని పాప మసలు కాదు పానపాత్ర యొసగు పరవశమ్ము
పాన మీయు నమర భావ సంకీర్తనల్ పానపాత్ర కళల స్వర్ణ సృష్టి
పాన మందు గలవు స్వప్న సౌందర్యాలు పానపాత్ర హృదయ ప్రణయ పాత్ర

పాన మాతని దయ పావన మ్మైనది పానపాత్ర యమృతభరిత పాత్ర
పాన మివ్వ సఖియ భవ్యమౌ జీవముల్ పానపాత్ర యిడును పరమసిద్ధి

పైపద్యములో అక్కరలు కూడ గలవు. సీస పాదములోని మొదటి సగమునకు అంతరాక్కర లక్షణములు, రెండవ సగమునకు అల్పాక్కర లక్షణములు గలవు. కావున దీనిని మిళితాక్కర అని చెప్పవచ్చును.

మిళితాక్కర
అంతరాక్కర- సూ-ఇం-ఇం-చం, యతి (1.1, 3.అంత్యాక్షరము)
అల్పాక్కర- ఇం- ఇం-చం, యతి (1.1, 3.1)

| అంతరాక్కర- | అల్పాక్కర- |
|---|---|
| పానశాల జగతి వైభవోత్కృష్టమౌ | పానపాత్ర లిచట పలువిధాలు |
| పాన మెన్నటికిని పాప మసలు కాదు | పానపాత్ర యొసగు పరవశమ్ము |
| పాన మీయు నమర భావ సంకీర్తనల్ | పానపాత్ర కళల స్వర్ణ సృష్టి |
| పాన మందు గలవు స్వప్న సౌందర్యాలు | పానపాత్ర హృదయ ప్రణయ పాత్ర |
| పాన మాతని దయ పావన మ్మైనది | పానపాత్ర యమృతభరిత పాత్ర |
| పాన మివ్వ సఖియ భవ్యమౌ జీవముల్ | పానపాత్ర యిడును పరమసిద్ధి |

(9) పద్యములో అదే పద్యము- నన్నెచోడుడు కుమారసంభవములో చతుర్విధకందమును మొట్టమొదట లిఖించెను. ఒకే కందములో నాలుగు కందములు ఉండునట్లు వ్రాయుట ఇందులోని కిటుకు. నన్నెచోడుని ఉదహరణను సులభముగా అర్థము చేసికొనుటకై మొదటి కందమును పూర్తిగను, మిగిలిన కందములకు మొదటి పాదమును ఇచ్చినాను.

ప్రథమ కందము-

సుజ్ఞానయోగతత్వ వి-
ధిజ్ఞులు భవ బంధనముల ద్రెంచుచు భువిలో

ద్వితీయ కందము- భవ బంధనముల ద్రెంచుచు
తృతీయ కందము- అజ్ఞానపదము బొందక

నజ్ఞానపదము బొందక
ప్రాజ్ఞులు శివు గొల్తు రచల భావన దవులన్

చతుర్థ కందము– శివు గొల్తు రచల భావన

క్రింద అష్టవిధ కందమునకు నేను వ్రాసిన ఒక ఉదాహరణను ఇచ్చుచున్నాను–

ప్రథమ కందము–
వెలిగెన్ వెలుగుల జిలుగుల
వెలసెన్ కలమై యలరెడు విరియయి కళమై
శిలమై వలపుల గమముల
సెలమై చెలువై నెల వలె సిరి హరి జెలగెన్

ద్వితీయ కందము– వెలుగుల జిలుగుల వెలసెన్
తృతీయ కందము– కలమై యలరెడు విరియయి
చతుర్థ కందము– అలరెడు విరియయి కళమై
పంచమ కందము– శిలమై వలపుల గమముల
షష్ఠ కందము– వలపుల గమముల సెలమై

సప్తమ కందము– చెలువై నెల వలె సిరి హరి

అష్టమ కందము– నెల వలె సిరి హరి జెలగెన్

## ఉపసంహారము–

గర్భకవిత్వము చిత్రకవిత్వములో అతి ముఖ్యమైనది. దీనిని వ్రాయుటకు ఛందస్సు బాగుగా అవగాహనమై యుండవలయును. సంస్కృతములో అక్కడక్కడ కనబడు గర్భకవిత్వము తెలుగులో మూడు పువ్వులు ఆఱు కాయలైనది. చాలమంది కవులు ఈ ప్రక్రియను ఎంతయో చాకచక్యముతో వ్రాసిరి. ఇది కవుల పాండితీ గరిమను, ఛందోనిపుణతను చక్కగా తెలుపును. ఎన్నియో నియమములను అనుసరించినను, పద్యమును లలితముగా భావయుక్తముగా కవులు వ్రాసిరి. ఈ ప్రక్రియను నేను శాస్త్ర రీత్యా పరిశిలించుచున్నాను. దీనికొఱకై చందన (CHANDassu ANAlysis) అను ఒక కంప్యూటర్ ప్రోగ్రాం కూడ వ్రాసినాను. This exercise is similar to the comparison of protein and DNA sequences in biological sciences. ఇంతవఱకు రెండువందలకు పైగా గర్భ కవితలను వ్రాసినాను. ఈ పద్యములను ఛందస్సు మఱియు రచ్చబండ ఫోరములలో చదువగలరు. వాటి చిరునామాలు–

http://groups.yahoo.com/group/Chandassu http://groups.yahoo.com/group/racchabanda

Questions and comments: jkmrao@yahoo.com